ప్రతాప రవిశంకర్

# వలను మింగిన చేప



గది తలుపులు తెరిచి లోపలకు వెళుతున్నప్పుడు వచ్చాడు అతను. అతనంటే పెద్దమనిషి కాదు. పదకొండేళ్ళ వాడు. వాడిపేరు సూర్యం. సెవెంత్ క్లాసు చదువుతున్నాడు.

రమక్క ఇప్పుడు మీ ఇంట్లో ఉందా!" అడిగాను వాడిని.

"లేదు. ఇంతకు ముందే ఇంటికి వెళ్ళిపోయింది. ఎందుకు?" అనగిగాడు వాడు అదోలా చూస్తూ.

"నేనో వారపత్రిక ఇస్తాను. దాన్ని రమకు ఇస్తావా?"

"ఇవ్వండి. ఇప్పుడే ఇచ్చి వస్తాను"

వెంటనే టేబిల్ సొరుగులోనించి ఓ వారపత్రికను తీసి దానిమీద నా పూర్తిపేరు రాసి వాడికి ఇచ్చాను. దానితోపాటు చందమామన్ను కూడా ఇచ్చి "రేపు ఉదయం దీని నువ్వు తప్పకుండా ఇవ్వాలి. ఇక ఈ పత్రికలో నేను రాసిన ఓ కథఉందని రమకు చెప్పు" అన్నాను

తలవూపి వాడు సంతోషంతో బయటకు ఒక్క పరుగు తీశాడు.

నాకూడా సంతోషమనిపించింది ఆ వారం ఓ వార పత్రికలో నేను రాసిన కథ అచ్చయ్యింది. ఇప్పుడు ఆ కథను రమ చదువుతుంది. ఆమె దృష్టిలో ఓ రచయితగా నా వాల్యూ పెరుగుతుంది. అప్పుడు రమతో ప్రేమాయణం జరపటానికి ఎక్కువ టైము తీసుకోదు.

ఇదీ నా ఆలోచన.

రమ బియ్యే సెకండియర్ చదువుతోంది. చురుకయిన ఆమె కళ్ళు చూసినప్పుడల్లా ఆ కళ్ళలో నాకు నక్షత్రాల వెలుగు కన

పడుతుంది.
ఆమెకు త్వరగా దగ్గర కావాలనే ఆరాటం నాలో కలుగుతోంది. అమ్మాయిల్లో రచయితల పట్ల ఎలాంటి క్రేజ్ వుంటుందో నాకు తెలుసు. అందుకే ఆ మార్గంలోనే రమకు ఎరవేయాలని నా ఉద్దేశం-
కాబట్టే నా కథ అచ్చయిన కరపత్రికను సూర్యంగాడికి ఇచ్చి ఆమెకు పంపించాను.
దీని రిజల్టు ఎలా వుంటుంది??
ఆ రాత్రంతా ఈ ఆలోచనలతోనే గడిపాను. ఎలాగో తెల్లవారింది.
ఉదయమే. ఆ వీధి చివరవున్న హోటల్లో టిఫిన్ చేసి వస్తున్నాను...
దార్లో నా వీక్లీ తీసుకుని వస్తున్న రమ కలిసింది. ఇంట్లోనించి బయటకువచ్చి-
"మీ కథ బావుంది చాలా బాగా రాశారు..." అన్నది రమ.
"థాంక్స్ .." అన్నాను చిరునవ్వుతో.
"మీరు కథలు రాస్తారని నాకు తెలీదు."
"ఈ మధ్యనే ఈ వీధిలోకి వచ్చానుకదా! అందువల్ల ఎవరికీ తెలియదు."
"మీరెక్కడ వర్క్ చేస్తున్నారు?" అడిగింది.
చెప్పాను ఓ ప్రభుత్వ కార్యాలయంలో అని—అప్పటికి ఇద్దరం సూర్యం వాళ్ళ ఇంటిముందుకు వచ్చాము.
"ఇంకా మీరురాసినకథలువున్నాయా?" ఆ వారపత్రికను నాకు ఇస్తూఅడిగింది.
"చాలా-ఉన్నాయి. రండి తీసుకెళదురుగాని" అన్నాను చనువుగా-
రమ తనంతట తానుగా నాతో మాట్లాడినప్పుడే నాకు ఆమె గురించిన సైకాలజీ తెలిసిపోయింది. ఆ అమ్మాయికు రచయితలపట్ల క్రేజ్ బాగానే ఉన్నది. కాబట్టి నావెంట గదిలోకి వస్తుందనే అనుకున్నాను,
అనుకున్నట్టుగానే వచ్చింది.
"కూర్చోండి."
"ఫర్వాలేదులెండి" అన్నది నిల్చునే
"నా కథలు నిజానికి ఓ పదికి మించి అచ్చుకాలేదు. వాటినే ఆ వారపత్రికల నించి కట్‌చేసి నీట్‌గా బైండ్‌చేయించాను."
ఆ బుక్‌నే రమకు ఇచ్చి "ఇంకా ఇలాంటి వాల్యూమ్స్ చాలా వున్నాయి. నా ఫ్రెండ్స్ చదివి ఇస్తామని తీసేసుకున్నారు. ముందు ఈ కథలను చదవండి." అని చెప్పాను.
రమ కొంచెంసేపు పేజీలు తిప్పి "మీరు కథల్ని రాత్రిటైమ్‌లో రాస్తారా? పగలు రాస్తారా?" అని అడిగింది.
నవ్వి "రాత్రి వేళలోనే ఎక్కువగా రాస్తాను. ఎందుకంటే నైట్‌టైమ్ మంచి ఆలోచనలు వస్తూ వుంటాయి" అన్నాను.
"ఎక్కువగా మీరు ఎలాంటి కథలు రాస్తూ ఉంటారు?"
"వయసులోవున్న పెళ్ళికాని కుర్రవాడ్ని ఎలాంటి కథలు రాస్తాను? ఈ వయసు కథలే. లవ్‌స్టోరీస్" మళ్ళీ నవ్వాను.
రమ కూడా నవ్వింది.
"ఎందుకు ఈ ప్రశ్నలన్నీ అడుగుతున్నారు? మీ క్కూడా అర్జంటుగా కథలు రాసేసి అచ్చులో మీ పేరును చూసుకోవాలని వుంది కదూ!" అన్నాను మెల్లగా ఆ అమ్మాయిని నా లైనులోకి తీసుకురావాలని
నవ్వుతూ తల వూపింది రమ.

"నాకు తెలుసు. కథలు రాయటమన్నది నిజంగా దేవుడిచ్చిన వరం. అది అందరికీ సాధ్యంకాదు. నాలాంటి ఏ కొద్దిమందికో అది సాధ్యమవుతుంది. మీ కోసం నేను ఓ పని చేస్తాను. ఏమిటంటే ఓ కథ రాసి దానికి మీ పేరుపెట్టి ఏదో పత్రిక్కి పంపుతాను. సరేనంటారా?" అన్నాను.
రమ మళ్ళీ తల ఊపింది.
"ఆ కథ పడిన తర్వాత ప్రతిఫలంగా నాకేం ఇస్తారో చెప్పండి" చిలిపిగా అడిగాను.
"ఆ కథకు పత్రికవాళ్ళు పంపించే డబ్బును మీరే తీసుకోండి" అన్నది వెంటనే.
"ముష్టి డబ్బు...ఎవడిక్కావాలి? నేను డబ్బుని లెక్కచేసే మనిషిని కాదు. ఐతే మీరు ప్రతిఫలంగా ఇంకేమీ ఇవ్వలేరా" అన్నాను ఈసారి కొంటెగా.
"సర్లెండి ముందు ఆ కథను రాయండి" అని ముసి ముసిగా నవ్వుకుంటూ వెళ్ళిపోయింది రమ.
వెంటనే కుర్చీలో కూలబడి పోయేను.
నా అదృష్టం. రమ లైన్లోకి వస్తోంది. రాక ఏం చేస్తుంది? నేను చూపిన ఎర అలాంటిది! నేను విసిరిన వల అలాంటిది. అప్పటికప్పుడే ఓ మంచి ప్లాటు గురించి ఆలోచించాలని అనుకున్నాను.
టైము చూశాను. తొమ్మిదిగంటలు దాటుతోన్నది.
అరగంటలో స్నానంచేసి డ్రెస్ చేసుకున్నాను.
గదికి తాళంవేసి ఆఫీసుకు బయల్దేరే ప్రయత్నంలో ఉన్నాను. సరిగా అప్పుడే వచ్చాడు సూర్యం.
వాడు ఓ నవలను నా చేతికిచ్చి "దీన్ని రమక్క మీకు ఇవ్వమని చెప్పింది" అని వెళ్ళిపోయాడు.
ఆ నవల పేరు చూశాను "నీలిరాగాలు" ఆ నవల ఓ ఆర్నెల్లక్రితం మూడు నెలల పాటు ఓ ప్రముఖ వార పత్రికలో సీరియల్‌గా వచ్చింది. దాన్ని "మయూరి" అనే ఆమె ఎవరో రాసింది.

ఈ నవల్ని రమ నాకెందుకు పంపించింది! అనుకుంటూ దాన్ని వెనక్కు తిప్పి చూసిన నాకు గుండె ఆగినంత పనయ్యింది. వెనుకవైపు రమ ఫోటో ఉన్నది. అందులో రమ నవ్వుతోంది. ఫోటోకింద వున్న మేటర్ని చదివి ఉలిక్కిపడ్డాను.
"మయూరి" పేరుతో ఎన్నో కథలు నవలలు రాస్తున్నది రమే. నా కళ్ళు తిరిగాయి. నా చెయ్యి కూడా కొంచెం వణికింది. రమ ముందు ఎన్ని కోతలు కోశాను?
ఇంతలో ఆ నవల్లోనించి ఓ చిన్న కాయితం కింద పడింది. దాన్ని తీసుకున్నాను ఆత్రంగా. అందులో ఇలా వుంది.
ఓ రచయితగారూ!
కథలు రాయడం దేవుడిచ్చిన వరమే ఇందుకు నేను కూడా ఒప్పుకుంటాను. కాని, ఆ వరంతో అందమైన అమాయకులైన అమ్మాయిలకు వల విసిరి వాళ్ళ జీవితాలను శాపంగా మార్చకండి. నిజానికి ఈ సమాజంపట్ల ఎక్కువ బాధ్యత కలిగిన మనిషి రచయితే-ఇకనైనా మీరు ఏ అమ్మాయినీ "నీ పేరుతో కథ రాసి పంపినందుకు ప్రతిఫలంగా నాకేమిస్తావు" అని అడగరనుకుంటాను."

— రమ